# ధర్మ సంకటం



కోర్టులో విచారణ ప్రారంభమైంది. మిస్ జూలీ బోనులో నిలబడి ఉంది.

"దేవుని ఎదుట ప్రమాణం చేసి నిజమే చెప్తాను. అబద్ధం చెప్పను." – ప్రమాణం పూర్తి అయింది.

"మి లార్డ్! ముద్దాయి కోర్టువారికి ఒక సమస్యగా మారిందని చెప్పడానికి విచారిస్తున్నాను. ఒక నేరానికి శిక్ష పడినప్పుడు, ఆ వ్యక్తి తిరిగి అటువంటి నేరం చేయడని ఆశించడం సాధారణంగా జరుగుతుంది. కాని, ఈమె ప్రవర్తన ఇందుకు పూర్తిగా విరుద్ధంగా ఉంది. రాష్ డ్రైవింగ్ అనేది ఈమెకి హాబీయేమో అనిపిస్తోంది. ఇదే నేరం మీద ఈమెను

న్యాయస్థానానికి పిలువవలసి రావడం ఇది పన్నెండోసారి! ప్రతీసారి ఈమెకి జరిమానా విధించి వదిలివేయడం జరుగుతోంది. అది ఈమెకు చాలినదిగా అనిపించడంలేదు. ఈ కారణంగా న్యాయమూర్తులు ఈమెకు తగిన శిక్ష విధించడంతోపాటు, ఈమె డ్రైవింగ్ లైసెన్స్‌ను కూడా రద్దు చేయడం భావ్యమని మనవి చేస్తున్నాను." – ప్రాసిక్యూషన్ వాదన ముగిసింది..

"ఈ అభియోగం పైన నీవు చెప్పదలుచుకున్న సంజాయిషీ ఏమైనా ఉందా?"

–జడ్జీగారు అడిగారు.

"లేదు ప్రభూ... నా నేరం ఒప్పుకుంటున్నాను" సవినయంగా బదులిచ్చింది జూలీ.

"నేరాన్ని సమర్థించుకోడానికి ప్రయత్నించకుండా ఒప్పుకున్నందుకు సంతోషం. కాని, పదేపదే ఇటువంటి నేరాలను ఎందుకు చేస్తున్నట్లు? నీ ప్రవర్తనవల్ల ఎన్నో ప్రమాదాలకు ఆస్కారం కలుగుతోంది. పదేపదే కోర్టు కేసులలో ఇరుక్కోడం నీకు సరదానా?"

"న్యాయమూర్తులు క్షమించాలి. తమ ప్రశ్నలకి నిజమైన సమాధానం చెప్పడం కష్టం."

"నిజమే చెప్తానని దేవుడిమీద ప్రమాణం చేశావు. ఆ నిజం ఎటువంటిదైనా చెప్పవలసిందే!"

"అయితే... నా సమాధానం విని ప్రభువులు ఆగ్రహం చెందకూడదని మనవి చేసుకుంటున్నాను."

కోర్టు హాలులో సూది పడినా వినబడేటంత నిశ్శబ్దం ఆవరించింది.

"రాష్ డ్రైవింగ్ కేసు మీద మొదటిసారిగా నేను తమ సముఖమునకు రప్పించబడ్డాను. తమరిని చూసిన మరుక్షణం నుంచి తమరి రూపం నా మనసులో చెరగని ముద్రను వేసింది. ఎంత వద్దనుకున్నా పదేపదే తమరినే చూడాలనిపిస్తోంది. మిమ్మల్ని చూడడానికి మరో దారిలేక ఈ విధంగా చేస్తున్నాను. నిజం చెప్పి తమ మనసుని నొప్పించినందుకు క్షమించవలసిందిగా కోరుతున్నాను" జూలీ తల వంచుకుని చెప్పింది.

కోర్టులో అందరూ ఫక్కున నవ్వబోయి, అది కోర్టు అనే సంగతి గుర్తొచ్చి బలవంతాన ఆపుకున్నారు.

జడ్జీగారి ముఖం గంభీరంగా మారింది. ఏమీ మాట్లాడకుండా కేసును వాయిదా వేశారు.

వాయిదా రోజున కేసు మరో జడ్జీగారి ముందుకు విచారణకి వచ్చింది.

*– తెలుగు వార పత్రిక... 4 మార్చి ' 83*